జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 12-7-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 393 పేజీలు: 4 వెల : రూ.7

# పథకం ప్రకారమే.. హత్య





* కొయిరాళ్లు జంక్షన్ వద్ద వైసీపీ నేత గోపి వాహనం అడ్డగింపు
* ఆ తర్వాత కర్రలు, రాళ్లతో కొట్టిన ప్రత్యర్థులు
* అక్కడికక్కడే మృతి చెందిన గోపి
* పరుగులు తీసిన స్థానికులు
* ఎంపీపీ చిరంజీవి ప్రధాన అనుచరుడు గోపి
* సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్పీ, డీఎస్పీ, సీఐలు
* టీడీపీకి చెందినవారే చంపేశారంటున్న కుటుంబీకులు, ప్రత్యక్ష సాక్షులు
* రోడ్డుపై బైఠాయించిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబీకులు
* ఫరీద్‌పేటలో భయాందోళన
* గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసిన ఎస్పీ మహేశ్వరరెడ్డి
* ఫరీద్‌పేటలో గతంలోనూ మర్డర్లు
* అతి సమస్యాత్మక గ్రామంగా గుర్తింపు



**శ్రీకాకుళం క్రైం, జూలై 11(వార్త):** ఫ్యాక్షనిస్టు గ్రామమైన ఫరీద్‌పేట సమీపంలో మరో హత్య జరిగింది. టీడీపీకి చెందిన కొందరు వైసీపీ నేతపై ఒక పథకం ప్రకారం కాపు కాసి.. మిట్టమధ్యాహ్నం అందరూ చూస్తుండగా కర్రలు, రాళ్లతో కొట్టి చంపిన ఘటన చోటుచేసుకుంది. దీంతో ఫరీద్‌పేటలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆ గ్రామంలో టీడీపీ, వైసీపీ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. అతి సమస్యాత్మక గ్రామమైన ఫరీద్‌పేటలో రాజకీయ కక్షలు, కార్పాన్యాలు మరో వ్యక్తి ప్రాణాలు బలిగొంది. ఏ క్షణాన ఏం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే..



ఎచ్చెర్ల మండలం ఫరీద్‌పేటకు చెందిన వైసీపీ నేత సత్తారు గోపి (46)ని కొయిరాళ్లు జంక్షన్ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం సుమారు రెండు గంటల సమయంలో అందరూ చూస్తుండగా ప్రత్యర్థి వర్గం, టీడీపీకి చెందిన కొందరు హత్య చేశారు. గోపి, మరోవ్యక్తి కోటేశ్వరరావుతో కలిసి బైక్‌పై కొయిరాళ్లు కూడలి నుంచి సర్వీసు రోడ్‌లో ఎచ్చెర్ల వైపు వెళుతుండగా, అదే రోడ్‌లో ఉన్న ప్రత్యర్థి వర్గానికి చెందిన వ్యక్తులు అడ్డుకున్నారు. కొందరు గోపీపై కర్రలు, రాళ్లతో దాడి చేశారు. తప్పించుకునేందుకు గోపి పరుగులు తీసినా వెంబడించి మరీ హతమార్చారు. బైక్ వెనుక కూర్చొన్న కోటేశ్వరరావు అక్కడి నుంచి పరుగులు తీశాడు. నడిరోడ్డుపై పట్టపగలు అందరూ చూస్తుండగా ఈ దాడి జరగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. హత్యానంతరం దుండగులు పరారయ్యారు. సమాచారం అందుకున్న డీఎస్పీ వివేకానంద, జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం, ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్ కుమార్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని హత్య జరిగిన తీరుపై ఆరా తీశారు. సంఘటనా స్థలాన్ని క్లూస్ టీమ్ సందర్శించి వివరాలు సేకరించింది. కుటుంబ సభ్యులు, బంధువులు అక్కడికి చేరుకుని మృతదేహం వద్ద కన్నీరుమున్నీరయ్యారు. ఎంపీపీ మొదలవలస చిరంజీవి, వైసీపీ శ్రేణులు అక్కడికి చేరుకుని గోపి మృతదేహం వద్ద నిరసన వ్యక్తంచేశారు. జాతీయ రహదారిపై బైఠాయించారు. హత్య చేసిన వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. మీడియాతో కోటేశ్వరరావు మాట్లాడుతూ గోపిని ఫరీద్‌పేటకు చెందిన టీడీపీ శ్రేణులే హత్య చేశారని తెలిపారు.కాగా, మృతుడిపై గతంలో పలు పోలీసు కేసులు ఉన్నారు. పాత కక్షలతోనే ఈ హత్య జరిగి ఉంటుందని పలువురు భావిస్తున్నారు. మృతుడికి భార్య సుగుణ, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య సుగుణ గ్రామ ఉప సర్పంచ్‌గా ఉన్నారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సైతం సంఘటనా స్థలానికి చేరుకుని హత్య జరిగిన తీరుపై పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అత్యంత సమస్యాత్మక గ్రామం కావడంతో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఇక్కడ పోలీస్ పికెటింగ్‌ను ఏర్పాటు చేశారు. కాగా, ఇదే తరహాలో గత ఆరు నెలల కిందట ఎంపీపీ చిరంజీవి అనుచరుడు కూన ప్రసాదరావును కూడా ప్రత్యర్థి వర్గం హతమార్చింది. గతంలో వైస్ ఎంపీపీగా పనిచేసిన కోటిపాత్రుని పోలినాయుడిని అదే గ్రామానికి చెందిన ప్రత్యర్థులు మాటువేసి హత్య చేశారు. అలాగే ఎంపీటీసీగా ఉన్న కొత్తకోట అమ్మినాయుడుపై కూడా హత్యాయత్నం జరిగింది. ఫ్యాక్షన్ గ్రామంగా ఫరీదుపేటకు పేరుంది. ప్రస్తుతం మరోమారు గ్రామంలో హత్య జరగడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.




## వంశధార ఎడమ కాలువకు గండి

**టెక్కలి, జూలై 11 (వార్త):** వంశధార ప్రధాన ఎడమ కాలువకు మరోసారి గండిపడింది. గత కొద్ది రోజుల కిందట హిరమండలం వద్ద కాలువకు గండిపడిన విషయం తెలిసిందే. ఆ ఘటన మరువకముందే టెక్కలి సమీ పాన 65.6వ కిలోమీటరు వద్ద లెఫ్ట్ బ్యాంక్ అండర్‌టర్నల్ సమీప గట్టుకు రంధ్రం పడింది. శుక్రవారం ఉదయం రంధ్రం వెంబడి నీరు వెళ్లడం గమనించిన రైతులు వంశధార అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన అధికారులు అక్కడకు చేరుకొని గండిని పూడ్చారు. వంశధార కాలువ వెంబడి 584 క్యూసెక్కుల సాగునీరు ప్రవహిస్తోంది. సకాలంలో గుర్తించడం ద్వారా ప్రమాదం తప్పిందని వంశధార అధికారులు తెలిపారు.



## భారత వాయుసేనలో ఉద్యోగ అవకాశాలు

**శ్రీకాకుళం, జూలై11(వార్త):** భారత వాయుసేనలో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు విభాగాల్లో ఉద్యోగాలను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందులో ఎయిర్‌మెన్ (మెడికల్ అసిస్టెంట్) స్థాయిలో శాశ్వత ఉద్యోగాలు ఉన్నాయి. అలాగే అగ్నిపథ్ స్కీమ్ కింద 'అగ్నివీర్వాయు (కాంబటెంట్)' కేటగిరీలో నాలుగేళ్ల పాటు సేవా అవకాశాలు కల్పించనున్నారు. ఎంపికైన వారిలో 25 శాతం మందిని శాశ్వత ఉద్యోగాల కోసం ఎంపిక చేస్తారు. ఈ నియామకాలకు సంబంధించి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ఈనెల 11వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుంది. జూలై 31వ తేదీ రాత్రి 11 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ప్రక్రియ పూర్తిగా https://airmenselection.cdac.inలేదా https://agnipathvayu. cdac. in వెబ్‌సైట్లలో జరుగుతుంది. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ప్రొవిజనల్ అడ్మిట్ కార్డులు జారీ చేస్తారు. అభ్యర్థులు అధికారిక నోటిఫికేషన్‌ను పరిశీలించేందుకు వీలుగా సంబంధిత వివరాలను ప్రత్యేకంగా అందించామని కలెక్టర్ తెలిపారు. జిల్లా యువత ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు https://air-menselection.cdac.in, https://agnipathvayu.cdac.in/AV/ వెబ్సైట్లను సంప్రదించవచ్చున్నారు. ఎయిర్‌మెన్ పోస్టులకు 10ప్లస్2లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లిష్‌తో కలిపి కనీసం 50శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. ఫార్మసీలో డిప్లొమా/బీఎస్సీ చేసినవారు కూడా అర్హులు. వయస్సు 10ప్లస్ 2 అభ్యర్థులకు 02-07-2005 నుంచి 02-07-2009 మధ్య జననం అయి ఉండాలి. ఫార్మసీ డిప్లొమా, బీఎస్సీ అభ్యర్థులకు 02-07-2002 నుంచి 02-07-2007 మధ్య జననం ఉండాలి. ఆన్‌లైన్ పరీక్షలో ఇంగ్లిష్, రీజనింగ్, జనరల్ అవగాహనపై ప్రశ్నలు ఉంటాయి. పరీక్షలో ఉత్తీర్ణులైనవారికి శారీరక దృఢత పరీక్ష, అడాప్టబిలిటీ టెస్ట్–I & II, మెడికల్ టెస్ట్‌లు నిర్వహిస్తారు. శిక్షణ సమయంలో నెలకు రూ.14,600 స్టైపెండ్ లభిస్తుంది. శిక్షణ అనంతరం రూ.26,900తో పాటు ఇతర అలవెన్సులు లభించనున్నాయి. అభ్యర్థి ఒక దరఖాస్తు మాత్రమే చేయాలి. ఫోన్, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు పరీక్ష కేంద్రాల్లో నిషేధం. దళారీలను నమ్మొద్దని వాయుసేన అధికారులు స్పష్టం చేశారు.

## వైసీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగ కమిటీలో ఇద్దరికి చోటు



**ఇచ్చాపురం, జులై 11(వార్త):** రాష్ట్ర వైస్సార్సీపీ మున్సిపల్ విభాగ కమిటీ లో ఇచ్చాపురం మున్సిపల్ కౌన్సిలర్ లు ఇద్దరికి చోటు లభించింది. ఒకటో వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్ కుమార్‌ను రాష్ట్ర కార్యదర్శిగా, 14వ వార్డు కౌన్సిలర్ నీలాపు లక్ష్మీని జాయింట్ సెక్రటరీ గా నియమించారు. ఈ మేరకు కేంద్ర కమిటీ నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. తనను పదవిలో నియమించడం పట్ల పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేసారు.

# ట్రాఫిక్ సమస్య తీరేదెన్నడో..?

**-మెయిన్ రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు**
**(సరుబుజ్జిలి)**

సరుబుజ్జిలిలో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకు ఎక్కువవుతోంది. దీంతో స్థానికులతోపాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా బస్టాండులో బస్సులు, కార్లు తదితర వాహనాలు రోడ్డుపై అడ్డదిడ్డంగా వెళుతుండడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటోంది. తోపుడు బండ్లు వ్యాపారులు మెయిన్‌రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసుకోవడంతో ట్రాఫిక్ సమస్యకు మరో కారణం ఉంటోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆమదాలవలస నియోజకవర్గం ఎమ్మెల్యే కూన రవికుమార్ కూరగాయల మార్కెట్ వ్యాపారులకు వెనక్కు పంపించి రోడ్డు విశాలంగా అయితే విగ్రహం పక్కనవైపు వరుసగా రోడ్డుకు వివిధ దుకాణాలు ఎదురుగా తోపుడు బండ్లు వెలిశాయి. గత కొన్ని సంవత్సరాలుగా ఇక్కడ ట్రాఫిక్ సమస్య ఉన్నప్పటికి ఏ ఒక్కరికి పట్టడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోజు రోజుకు రోడ్డును ఆక్రమిస్తున్నా అడిగేవారు లేరు. ప్రధాన రోడ్డుపై కొత్తూరు వైపు నుంచి నాన్‌స్టాఫ్ సర్వీసులు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు, దూర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు వైఎస్సార్ విగ్రహం వద్ద, మలుపులో పాలకొండ రోడ్డుకు వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడంలేదు. ఇక్కడ తోపుడుబండ్లు రోడ్డుపై అడ్డంగా ఉండడంతో డ్రైవర్లు వాహనాలను అతి జాగ్రత్తగా నడపాల్సి వస్తోంది. ఏమాత్రం పొరపాటు జరిగినా ప్రమాదం జరుగుతుందోనని బస్సు డ్రైవర్లు భయం భయంతో మలుపులో తిప్పుకుని వెళుతుంటారు. గత ఏడాది అదే ప్రాంతంలో ఆర్టీసీ బస్సు తోపుడుబండ్లవైపు బ్రేక్ ఫెయిల్ అయి దూసుకొచ్చిన ఘటనలో అక్కడున్న



ద్విచక్ర వాహనాలు ధ్వంసమై లక్షల రూపాయలు నష్టం వాటిల్లింది. ప్రస్తుతం అధికారులు, ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆ ప్రాంతంలో చర్యలు తీసుకుని ప్రమాదం జరుగక ముందే రోడ్డు వెడల్పు చేయాలని ఆర్టీసీ బస్సుల డ్రైవర్లు, అధికారులు విన్నవించినట్లు తెలిసింది. ఎమ్మెల్యే కూన రవికుమార్ ఈ సమస్యను తెలియజేసినట్లుగా కార్మికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా వెంటనే చర్యలు తీసుకోవాలని మండలం వాసులు కోరుతున్నారు.

# డంపింగ్ యార్డ్‌ను పరిశీలించిన కమిషనర్



**పలాస, జులై 11(వార్త):** పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో గల డంపింగ్ యార్డ్ లో సుమారు 18 వేల టన్నుల లెగసీ వేస్టు పేరుకుపోయినట్లు పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు తెలియజేశారు. శుక్రవారం ఉదయం పురపాలక సంఘం యొక్క డంపింగ్ యార్డ్ ను సిబ్బందితో సహా తనిఖీ చేసి అక్కడ నిల్వ ఉన్న లెగసి వేస్ట్ ను తరలించే ప్రక్రియలో భాగంగా జరుగుచున్న పనులను ఇన్స్పెక్ట్ చేయడం జరిగింది. డంపింగ్ యార్డ్ లో ఉన్న లెగసి వేస్ట్ ను తరలించే ప్రక్రియలో భాగంగా 2 జెసిబి లు, 3 ట్రాక్టర్లతో డంపింగ్ యార్డు లో పనులు చేయడం మొదలుపెట్టారు. ఈ ప్రక్రియలో భాగంగా సుమారు 3 టన్నుల లెగసి వేస్టును లెవెల్ చేయడం జరిగింది . ఈ లెగసి వేస్ట్ ఎక్కువగా పేరుకుపోవడం వల్ల డంపింగ్ యార్డ్ లో పురపాలక సంఘం నుండి వచ్చిన వేస్ట్ ను డంపింగ్ యార్డ్ లో అన్లోడింగ్ చేయడానికి కూడా స్థలం చాలక చాలా ఇబ్బందులు పడవలసిన పరిస్థితి ఏర్పడింది. దీనిని గమనించిన కమిషనర్ యుద్ధ ప్రాతిపదికన అద్దెకు జేసీబీలు, ట్రాక్టర్లు తెప్పించి హుటాహుటిన ఆ పేరుకుపోయిన లెగసి వేస్ట్ ను క్లియర్ చేయించడం పర్యవేక్షించారు.

# కాకినాడ జిజిహెచ్ నిందితులను కఠినంగా శిక్షించాలి

**ఇచ్ఛాపురం, జులై 11(వార్త):** కాకినాడ జి జి హెచ్ లో50 మంది పార మెడికల్ విద్యార్థినీలపై లైగింక వేధింపులుకు గురి చేసిసెల్ ఫోన్ లో విద్యార్థుల శరీర భాగాలు ఫోటోలు తీసి వారికే పంపి బ్లాక్ మెయిలింగ్ కు పాల్పడుతున్న బయోకెమిస్ట్రీ ల్యాబ్ అటెండెంట్, సహకరిస్తున్న మరో ముగ్గురు ల్యాబ్ టెక్నిషియన్ల ను కఠినంగా శిక్షించాలని వైస్సార్సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మరియు మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఉళాల భారతీ దివ్య డిమాండ్ చేశారు.కోరికలు తీర్చకపోతే పరీక్షల్లో ఫెయిల్ చేస్తామని బెదిరింపులు పాల్పడిన వారిపైలైగింక వేధింపులపై ఆర్ఎంసి ప్రిన్సిపాల్ కు విద్యార్థినీల ఫిర్యాదు చేసారని అన్నారు. విద్యార్థినీలను విచారించిన ప్రత్యేక కమీటి ఈ కీచకులు పైన ఎక్స్టార్షన్ కింద సెక్షన్ 308 అండ్ సెక్షన్ 76 కేసు నమోదుచేసి అలానే ఇంకా బాలికలు ఏ రకమైన మానసిక అలాగే లైంగిక హరాస్మెంట్ కి పాల్పడ్డారు వారి నుంచి స్టేట్మెంట్ తీసుకొని ఇంకా సెక్షన్లు కఠినమైనవి యాడ్ చేసి చట్టరీత్యా వాళ్ళకి శిక్ష పడి ఇలాంటి అసభ్యకరమైన పనులు చేసే వాళ్ళకి తగిన బుద్ధి చెప్పి మరి ఇంకా ఎవరైనా ఇలాంటి నీచమైన పనులు చేయాలంటే భయపడేలా చర్యలు తీసుకొని 50 మంది బాలికలకు కూడా న్యాయం చేయాలని శ్రీకాకుళం జిల్లా మహిళలు తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు.



# 8 మంది అనాథలకు వెంటనే ఆధార్ కార్డులు



**శ్రీకాకుళం, జులై 11(వార్త):** శ్రీకాకుళం జిల్లాలో ఆధార్ కార్డులు లేని ఎనిమిది మంది అనాథ పిల్లలను గుర్తించామని, వారికి వెంటనే ఆధార్ కార్డులు జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు వెల్లడించారు. ఈ మేరకు ఆయన స్థానిక అధికారులతో ఒక సమావేశం నిర్వహించి, వారికి అవసరమైన సహకారం అందించాలని కోరారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, ఆధార్ లేని నిరాశ్రయులైన పిల్లల కోసం జిల్లాలో ఒక ప్రత్యేక సర్వే చేపట్టారు. ఈ సర్వే ప్రధాన లక్ష్యం అనాథ పిల్లలకు చట్టపరమైన గుర్తింపు కల్పించి, వారిని ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అనుసంధానించడమే. ఆధార్ కార్డు లేకపోవడం వల్ల వారికి విద్య, వైద్యం, ఇతర ప్రభుత్వ ప్రయోజనాలు అందడం లేదని హరిబాబు పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా మార్గదర్శకత్వంలో జరిగిన ఈ సమావేశంలో శ్రీకాకుళం తహసీల్దార్ ఎస్. గణపతి రావు, జిల్లా ఆసుపత్రి జాయింట్ డైరెక్టర్ బి. రాజశేఖర్ రెడ్డి, వన్‌స్టాప్ సెంటర్, మున్సిపాలిటీ అధికారులు, ఇతర సంబంధిత విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు. తహసీల్దార్, జాయింట్ డైరెక్టర్, మున్సిపాలిటీ అధికారుల సహకారంతో ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని హరిబాబు వివరించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ జి. ఇందిరా ప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## పైనాపిల్‌పై విలువ ఆధారిత శిక్షణ

**కొత్తూరు, జులై 11(వార్త):** అడ్డంగి పంచాయతీలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివాసీ రైతు ప్రగతి ఎఫ్‌పీవో సభ్యులకు పైనాపిల్‌పై విలువ ఆధారిత జోడింపు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పైనాపిల్ ఫలాలతో జామ్, జ్యూస్ తయారీపై శిక్షణ ఇచ్చారు. దీనివల్ల రైతులు వారి పంటకు మంచి ధర పొందడమే కాకుండా, స్థానిక యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ సవర్ ఆనందరావు, బి.వసంత, తోట మిన్నారావు, కార్యకర్త సవర్ నారాయణ, గ్రామస్థులు, యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా శేఖర్

**ఇచ్ఛాపురం, జులై 11(వార్త):** ఇచ్ఛాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మ న్‌గా జనసేన నాయకులు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు సోదరుడు దాసరి శేఖర్‌ను నియమించారు. డైరెక్టర్‌లుగా నందిగం సరస్వతి, బృందావన్ దోలాయి, గంతల రాజు, రత్నాల రామారావు, దడ్డ లక్ష్మీ, బి.మంగమ్మ, అంకుల మల్లి, బడే దేవరాజు, పైల శ్రావణి, దుంగు హేమలత, జి.రామకృష్ణ సాహు, కనగర్ల మన్మధరావు, పొల్లాయి డిల్లమ్మను నియమించారు. గౌరవ అధ్యక్షులుగా ఎమ్మెల్యే బెందాలం అశోక్ వ్యవహరిస్తారు.



## అటవీ హక్కుల చట్టంపై అవగాహన



**మెళియాపుట్టి, జులై 11(వార్త):** కొత్తూరు వెలుగు అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో కేరాసింగి పంచాయితీ, డబారు గ్రామంలో శుక్రవారం అటవీ హక్కుల చట్టం, హాబిటేట్ రైట్స్, రికార్డ్స్ ఆఫ్ రైట్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించినట్టు అసోసియేషన్ ప్రతినిధి నాగరాజు తెలిపారు. అటవీ హక్కులచట్టం 2006 ప్రాప్తికి పొందే హక్కులు, హాబిటెట్ రైట్స్, వాటి ఉపయోగాలు, రికార్డ్స్ అఫ్ రైట్స్ ల, ఉపయోగాలు గురించి వివరించారు. గిరిభూమి పోర్టల్లో వ్యక్తిగత పట్టాలు నమోదు చేసుకొనె విధానముతో పట్టాలు నమోదయింది లేనిది గిరీభూమి యాప్ లో ఎలా చూసుకోవడమో తదితర వాటిని డెమో చేసి చూపించారు. కార్యక్రమంలో డబారు, సవర ఆంజనేయపురము, పొగడవెల్లి, చిన్నసున్నాపురము తదితర గ్రామస్తుల తో పాటు రిసోర్స్‌పర్సన్లు ఏసిఓ ఎ.చిరంజీవిరావు, ఎ.నాగరాజు, మోబలైజర్సు కల్యాణి, హరిచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ స్వరాజ్యం ప్రభుత్వ ధ్యేయం

**కొత్తూరు, జులై 11(వార్త):** కొత్తూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 2022-23 సంవత్సరానికి గాను పంచాయతీ పురోగతి సూచికపై అవగాహన సదస్సు నిర్వహించారు. 9 రకాల సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలోని డేటా పాయింట్స్ ఆధారంగా గ్రామ అభివృద్ధిని మెరుగుపరచడానికి అవసరమైన మార్గదర్శకాలు వివరించారు. ప్రతి గ్రామ పంచాయతీ అభివృద్ధి పథంలోకి రావాల్సిందిగా ట్రైనింగ్ ద్వారా స్పష్టమైన దిశానిర్దేశం ఇచ్చారు. ఈ సందర్భంగా మండల వైస్ ఎంపీపీ లోతుగడ్డ తులసీ వరప్రసాద రావు మాట్లాడుతూ, “మండలంలో ప్రతి గ్రామ పంచాయతీకి స్వయం పాలన (స్వరాజ్యం) తీసుకురావడానికి సీఎం చంద్రబాబు నేతృత్వంలో నూతన మార్గదర్శకాలు అమలవుతున్నాయి. గ్రామ ప్రజల అవసరాలను అర్థం చేసుకుని, వారికోసం కార్యాచరణ రూపొందించి, కార్యాలయ సిబ్బంది సేవలు మెరుగుపరచాలని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపిడిఓ, పరిపాలన అధికారి, మండల స్థాయి అధికారులు, అన్ని సచివాలయాల పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు, ఇంజనీరింగ్ సహాయకులు హాజరయ్యారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## 14న మెగా జాబ్ మేళా

**శ్రీకాకుళం, జులై 11(వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాకుళం నియోజకవర్గంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు శాసనసభ్యులు గొండు శంకర్ ప్రకటించారు. ఈ నెల 14న (సోమవారం) ఉదయం 9 గంటల నుండి స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ జాబ్ మేళా జరుగుతుందని తెలిపారు. సుమారు 10 కంపెనీలు పాల్గొంటున్న ఈ మేళా ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యమని ఎమ్మెల్యే వివరించారు. 18 నుండి 30 సంవత్సరాల వయస్సు గల, ఎస్.ఎస్.సి., ఇంటర్మీడియట్, ఐ.టి.ఐ., డిప్లొమా, డిగ్రీ, బి.ఫార్మసీ ఉత్తీర్ణులైన యువతీ, యువకులు ఈ జాబ్ మేళాకు అర్హులని ఆయన తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తప్పనిసరిగా naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని, రిఫరెన్స్ నంబర్‌తో పాటు రావాలని సూచించారు. అభ్యర్థులు తమ రెస్యూమే, ఆధార్ కార్డు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు ఒరిజినల్, జిరాక్స్ కాపీలు, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో తీసుకుని రావాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 9704960160, 9550967353 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.



## అలరించిన నృత్య ప్రదర్శనలు

**ఇచ్ఛాపురం, జులై 11(వార్త):** పురుషోత్తపురం పుష్పగిరి కొండపై వెలసి ఉన్న భగవాన్ షిరిడి సాయిబాబా ఆలయంలో వ్యాస పూర్ణిమ శుభ సందర్భంగా ఏర్పాటుచేసిన వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ గురువు బలివాడ శృతి పట్నాయక్ అకాడమీ వ్యవస్థాపకులు చిన్నా గురుస్వామి వారి ఆధ్వర్యంలో కూచిపూడి భరతనాట్యం శాస్త్రీయ నృత్యాలు అందరినీ అలరించాయి. గురువులకు సంబంధించిన చక్కటి పాటలతో చిన్నారులు దీక్షిత ప్రణవి తనుశ్రీ రమ్య విద్య జ్వాల సింధు పల్లవి లిఖిత రమ్యశ్రీ డాన్స్ టీచర్స్ కావ్య పూజ జయ లక్ష్మి లు పాల్గొని గణనాయక సిరుల నొసగు ఒక్కడే సూర్యుడు గరుడ గమన గురుబ్రహ్మ శివతాండవం వేయి నామాలవాడు చక్కని పాటలకు తమ నాట్యంలో ప్రతిభను చూపించారు ఆలయ ధర్మకర్త ఉప్పాడ కృష్ణ సాయి దంపతులు చిన్న గురుస్వామి దంపతులకు నాట్య గురువులకు సత్కరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ లో మరియు బెల్లుపడ శివానందగిరి పై చిన్న గురుస్వామి దంపతులకు నాట్య గురువు శృతి పట్నాయక్ లకు పాద పూజ చేసి తమ గురుభక్తిని చాటుకున్నారు. శిష్య బృందం డాన్స్ టీచర్స్ కావ్య శైలు పూజ జయ శ్వేత లక్ష్మి జాహ్నవి మరియు భజన కళాకారులు అనపాన కుమారి హేమంత్ కుమార్ బాడిత్య నిత్యానంద బల్లెడదీక్షిత యజ్ఞనంద మాస్టర్ పాల్గొన్నారు.

## 'భాస్కరుని' వరించిన మందస పీఏసీఎస్ 'చైర్మన్'



**మందస, జులై 11(వార్త):** మందస ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) చైర్మన్ పదవి తమిరియా భాస్కరరావును వరించింది. మందస మండలంలోని హంసరాలి గ్రామానికి చెందిన ఆయన గతంలో హంసరాలి సర్పంచ్ గా కూడా పనిచేశారు. టీడీపీ సీనియర్ నాయకుడైన భాస్కరరావు పదవి లభించడం పట్ల ఆయన అభిమానులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భాస్కరరావు తెలుగుదేశం పార్టీలోనే ఉంటూ, పార్టీకి ఎన్నో సేవలు అందించారు. గౌతు కుటుంబంతో సాన్నిహిత్యంతో ఉండే ఆయన అనారోగ్యం సైతం లెక్క చేయకుండా పార్టీ అభివృద్ధి కష్టపడ్డారు. గత ఎన్నికల్లో ఆయన పడిన కృషి, పట్టుదలని పార్టీ గుర్తించింది. పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు మందస పీఏసీఎస్ కు అందాయి. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ, కూటమి ప్రభుత్వం క్రమశిక్షణ విధేయత, కృషిని గుర్తించడంతో తనకీ పదవి వచ్చిందనారు. పలాస ఎంఎల్ఏ గౌతు శిరీషా మా మాజీ మంత్రి గౌతు శివాజీ, పలాస నియోజకవర్గం టీడీపీ రథసారధి, సమన్వయకర్త వెంకన్నచౌదరి కృత్ణతలు తెలిపారు. పదవి రావడానికి అన్నివిధాలుగా సహకరించిన ప్రతీ ఒక్కరికీ ఋణపడి ఉంటానన్నారు. సొసైటిల్లని అభివృద్ధి పథాన నడిపిస్తానన్నారు. రైతులకు సహకరిస్తానని పేర్కొన్నారు.

## పోస్ట్‌మేన్ ఔదార్యం



**మందస, జులై 11(వార్త):** హరిపురం పోస్ట్‌మేన్ ఔదార్యం చూపారు. తలసే యాతో బాధపడుతున్న భావన అనే చిన్నారికి రక్తం అవసరం కావడంతో పోస్ట్ మేన్ నారాయణ రావు రక్తదానం చేశారు. మందస మండలం లోని హరిపురం పరిధిలో ఆయన పోస్ట్ మేన్ గా పనిచేస్తున్నారు. ఆ నలుగురు ట్రస్ట్ ఆధ్వ ర్యంలో నారాయణరావు రక్తదానం చేయగా ఆయనను పలువురు అభినందించారు. రక్తదాతకు ఆ నలుగురు ట్రస్ట్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

## జోగేంద్ర వర్మ కుటుంబానికి నీలకంఠం పరామర్శ

**మందస, జులై 11(వార్త):** మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన దున్నవూరు గ్రామానికి చెందిన యువకుడు జుత్తు జోగేంద్రవర్మ రోడ్డు ప్రమాదంలో మరణించారు. మృతుని కుటుంబాన్ని అగ్నికుల క్షత్రియ జిల్లా నాయకుడు జుత్తు నీలకంఠం పరామర్శించారు. గ్రామ పెద్ద జుత్తు కూర్మారావు కుమారుడు జోగేంద్రవర్మ(కార్తీక్) ఇటీవల వైజాగ్ నుంచి సొంత ఊరు వస్తుండగా భోగాపురం దగ్గర హైవే పై జరిగిన ప్రమాదంలో మరణించడం బాధకరమన్నారు. కార్తీక హఠాన్మరణం చాలా దురదృష్టమైన సంఘటనని, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని దేవుని ప్రార్థిస్తున్నామన్నారు. మృతుని కుటుంబాన్ని ఓదార్చి, సంతాపం తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అగ్నికుల క్షత్రియ అధ్యక్షుడు గౌరకల వసంతస్వామి, పెద్దలు దున్న రామారావు, గ్రామ పెద్దలు ఉన్నారు.



# పాఠశాలలో వసతుల్లేవ్.. పట్టించుకోండి..!

**(సరుబుజ్జిలి)**

సరుబుజ్జిలి మండలం ప్రభుత్వ పాఠశాలలో సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యాశాఖ అధికారులు ఇప్పటికైనా పట్టించుకొని చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సరుబుజ్జిలి మండలం లో ఉన్న మండలంలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి చాలా అధ్వానంగా ఉంది. కనీస పిల్లలు కుర్చీ డానికి సౌకర్యాలు లేకుండా పాఠశాలలో తరగతులు ప్రారంభమయ్యాయి. విద్యాశాఖ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతోంది. సరుబుజ్జిలి మండలం లో కేంద్రం లో ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదికి వెలుతురు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న ఒక గదికి తలుపులు లేవు.

గాలి, దుమ్ము, భారీ వర్షం వచ్చినప్పుడు పిల్లలు గదిలో కూర్చోవడానికి కూడా వీలులేని పరిస్థితి ఏర్పడింది. ఈ స్కూల్లో 116 మంది విద్యార్థులున్నారు. పాఠశాలలో మరుగుదొడ్లు సరైనవి కూడా లేవు. స్కూలు బాగాలేదని.. వర్షం వస్తే పిల్లలు కూర్చునే పరిస్థితి లేదని అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా పట్టించుకొని పాఠశాలలో వసతులు కల్పించాలని కోరుతున్నారు.



# ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

**పలాస, జులై 11(వార్త):** ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం లో వచ్చే ప్రజా ఫిర్యాదులను పూర్తి స్థాయిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలో గల పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ ఆవరణంలో నిర్వహించిన ప్రజా పిర్యాదులు స్వీకరణ కార్యక్రమంలో ప్రజల నుండి పిర్యాదులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులపై చట్ట పరిధిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ ఆదేశించారు. కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధి పరిసర ప్రాంత ప్రజలు కొరకు శుక్రవారం కాశీబుగ్గ పోలీసు స్టేషన్ ఆవరణంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం)" నందు సమస్యలతో వచ్చిన ప్రజల



నుండి ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించి వారి సమస్యలను విని, సానుకూలంగా స్పందించి, వారి సమస్యలపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కారం అందిస్తామని భరోసా ఇచ్చారు. తక్షణమే ఆయా ఫిర్యాదులను గూర్చి సంబంధిత పోలీస్ అధికారులకు తెలిపి చట్ట ప్రకారం విచారణ జరిపి త్వరితగతిన పరిష్కారం అందించాలని ఆదేశించారు. కాశీబుగ్గ పోలీసు స్టేషన్ ఆవరణంలో ప్రత్యేకంగా నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సివిల్, కుటుంబ కలహాలు, ఆస్తి , కొట్లాట,మిస్సింగ్, చీటింగ్ ఇతరత్రా అంశాలపై ఫిర్యాదులు అందాయి. ఆయా పిర్యాదులు పై తీసుకున్న చర్యలు ను నివేదిక రూపంలో నిర్ణీత సమయంలో జిల్లా పోలీసు కార్యాలయానికి అందజేయాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో కాశీబుగ్గ డిఎస్పి వెంకట అప్పారావు, సిఐలు పి సూర్యనారాయణ, తిరుపతిరావు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# కార్గో ఎయిర్‌పోర్ట్‌కు సెంట్ భూమి ఇవ్వం



**మందస, జులై 11(వార్త):** కార్గో ఎయిర్పోర్ట్ ఒక్క సెంట్ భూమిని కూడా ఇవ్వమని కార్గో ఎయిర్ పోర్ట్ నిర్మాణ ప్రతిపాదిత భూముల రైతులు అన్నారు. కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక కమిటీ అధ్యక్షుడు కొమర వాసు అధ్యక్షతన మందస మండలంలోని రాంపురం గ్రామ కమిటీ హాల్ దగ్గర బాధిత రైతులతో సమావేశం నిర్వహించారు.. అత్యవసర సమావేశం ఏర్పాటు చేయడానికి ప్రధాన కారణం పలాస ఆర్.డి.ఓ అని ఆరోపించారు. గత నాలుగు రోజులుగా స్థానిక సర్పంచ్ పొట్టి ధర్మరావుకు ఫోన్ చేసి నేడు, రేపు వస్తానని పొంతనలేని సమయం చెబుతున్నారని ఆరోపించారు. ఇదే రోజు కూడా 9.30నిమిషాలకి వస్తున్నానని, రైతులతో సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారని, అందుకు అనుగుణంగా బాధిత రైతులంతా వచ్చారని.. సుమారు 3గంటలు సమయం ఎదురు చూశారన్నారు. అధికారులు రాకపోవడంతో సమావేశం ద్వారా నిరసన తెలియజేశామన్నారు. పచ్చని ఉద్ధానంలో కార్గో ఎయిర్పోర్ట్ ఒక్క సెంట్ భూమిని కూడా ఇవ్వమని ఉన్నతాధికారులు తెలియజేస్తున్నామన్నారు. అభివృద్ధి నమూనాలో సుమారు 16గ్రామాల ప్రజలు తమ జీవనాధారాలైన వ్యవసాయము, సహజ ఆవాసాల నుండి పెకిలించి వేయడంతో వారి నిలకడ గల ప్రశాంత ఆదాయ వనరులను కోల్పోయి, నిరభాగ్యులుగా మార్చి వేయబడతారన్నారు. తాతలు తండ్రుల నుంచి జీవితాలను ధారబోసి కష్టపడి పోగేసుకున్న జానెడు భూమిని లాక్కొని వాళ్ల జీవించే హక్కును హరించి వేస్తూ అత్యంత క్రూరంగా అభివృద్ధి మంత్రంతో మంత్రగాలుగా పాలకవర్గాలు నటిస్తున్నాయన్నారు. రైతులంతా ముక్తకంఠంతో పోరాడి హక్కులు మనం సాదించికుందామన్నారు. స్థానిక ఎమ్మెల్యే శిరీష స్పందించి బాధిత రైతులకి అండగ నిలబడి కార్గో ఎయిర్ పోర్ట్ నిర్మించకుండా అడ్డుకోవాలని బాధిత రైతులతో కలసి పోరాటం లో భాగస్వామ్యం అవ్వాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పొట్టి ధర్మారావు, డా.వై.యస్.అర్. ఉద్యాన యూనివర్సిటీ మాజీ బోర్డ్ మెంబర్ బత్తిని లక్ష్మణ్, దున్న హరికృష్ణ, తామడ తుంబనాధం, చిత్త గున్నయ్య, దాసరి మోహన్, తామడ హేమారాజ్, జుత్తు భూపాతి, పొట్టి ఎర్రయ్య, నల్ల పరుశురాం, గుంటు రామస్వామి, గుంటు లోకనాధం పాల్గొన్నారు.

# సమస్యల తక్షణ పరిష్కారానికే ప్రజాదర్బార్

**-ఎమ్మెల్యే గొండు శంకర్**



**శ్రీకాకుళం, జులై 11(వార్త):** నియోజకవర్గంలో ప్రజలు వారి సమస్యలను నేరుగా తమ దృష్టికి తెస్తే సమస్య పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ అన్నారు.11- 07-2025, శుక్రవారం విశాఖ ఏ కాలనీ పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. శ్రీకాకుళం, గార శ్రీకాకుళ పట్టణంలోని ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులు సంప్రదించి సమస్య పరిష్కరించే దిశగా ప్రయత్నాలు చేస్తామని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కూటమి ప్రభుత్వములో ప్రజా సమస్యలకే పెద్దపీట వేస్తున్నామని, ఎవరికి ఏ సమస్య వచ్చినా నిరభ్యంతరంగా వారి సమస్యలను తెలపవచ్చని ఆయన తెలిపారు. సమస్యలు పరిష్కరించడంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు ఈ ప్రజా దర్బార్ కు అధిక సంఖ్యలో మహిళలు ప్రజల వచ్చి సమస్యలపై వినతలు అందజేశారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## సమావేశానికి హాజరైన వారికి కృతజ్ఞతలు

**పలాస, జులై 11(వార్త):** 'బాబు షూరిటీ మోసం గ్యారంటీ' పేరుతో ప్రజల్లోకి వెళ్లేందుకు వైసీపీ అధిష్టానం ఆదేశాల మేర బుధవారం పలాసలో గల ప్రగతి భవన్ వద్ద నిర్వహించిన వైఎస్ఆర్సిపి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వైయస్సార్సీపి అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ విస్తృత స్థాయి సమావేశం లో వైయస్సార్సీపి సంస్థ గత కమిటీల కార్య వర్గాల ప్రమాణస్వీకారం కార్యక్రమం తో మరింతగా వైసీపీ శ్రేణులకు బాధ్యత పెరిగింది అన్నారు. ప్రతికూల పరిస్థితు లను ఎదుర్కొంటూ.. వైసీపీ శ్రేణులు మరింత బాధ్యతాయు తంగా క్షేత్రస్థాయిలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను తెలియజేసేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.



# బాబు షూ్యరిటీ మోసం గ్యారంటీ

**-వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్**



**నరసన్నపేట, జులై 11(వార్త):** చంద్రబాబు తన మార్కు షూ్యరిటీ మోసాలతో ప్రజలను దారుణంగా వంచిస్తున్నారని టీడీపీకి ప్రజలే గ్యారంటీగా తగిన బుద్ధి చెబుతారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘాటుగా విమర్శించారు. నర్సన్నపేట నియోజకవర్గంలోని ఎస్ఎల్విడి కళ్యాణ మండపంలో జరిగిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం ఆసక్తికరంగా జరిగింది. ఈ సమావేశానికి యువ నాయకుడు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య అధ్యక్షత వహించారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త తమ్మినేని సీతారాం, జిల్లా పరిశీలకులు, ఎమ్మెల్సీ కుంబా రవిబాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ... "చంద్రబాబు తన హయాంలో గ్యారంటీ మోసాలు, షూ్యరిటీ పేరుతో పేద ప్రజలను అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నారని, ఇలాంటివి మళ్లీ జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ధర్మాన కృష్ణదాస్ పేర్కొన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో జగనన్న పాలనతో పోల్చి చూస్తే సంక్షేమ పథకాలతో ప్రజలు ఎక్కడ సంతృప్తి వ్యక్తం చేయడం లేదన్నారు. ప్రతి ఒక్క కుటుంబానికీ ఆర్థిక స్థిరత్వం తీసుకువచ్చేలా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చక్కటి పాలన అందించగా, సూపర్ సిక్స్ సూపర్ సెవెన్ మోసాలతో టిడిపి ప్రభుత్వం ప్రజలను వంచించిందని తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కుంబా రవిబాబు మాట్లాడుతూ, ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పూర్తి మద్దతుగా నిలుస్తారని, చంద్రబాబు చేసిన అవినీతి, మోసాలను మరిచిపోలేరని అన్నారు. ఇప్పటికే తాము ఏం కోల్పోయామో ప్రజలు స్పష్టంగా తెలుసుకోగలుగుతున్నారని వివరించారు. అనంతరం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో నేతలు ప్రత్యేకంగా సమావేశమై రాబోయే దశల్లో పార్టీ బలోపేతంపై కార్యాచరణను రూపొందించారు. కేడర్ అంతా ఒక్కటిగా ఉంటేనే మరోసారి జగనన్నను ప్రజా శ్రేయస్సు కోసం నిలుపుకోగలమని నేతలు పునరుద్ఘాటించారు.



## ఇంటరాక్ట్ క్లబ్‌ల నియామకం

**ఇచ్ఛాపురం, జులై 11(వార్త):** రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఇంటరాక్ట్ క్లబ్ ల నియామకాలు జరిగాయి.జ్ఞాన భారతి, రవీంద్రభారతి, స్వర్ణ భారతి,సత్యసాయి,శాంతి నికేతన్, హెబ్రాన్, కస్తూరి భా విద్యాలయం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మున్సిపల్ బాలికోన్నత పాఠశాలల నుంచి ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శి లు తిప్పన మోహన్ వెంకటేష్ రెడ్డి, కాదా రామకోటి, దక్కత త్రినాథ్ రెడ్డి, జోహార్ ఖాన్, దక్కత కృష్ణమూర్తి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంకల్పం పార్కు కు మరమ్మతులు



**ఇచ్ఛాపురం, జులై 11(వార్త):** లొద్దపుట్టి తులసమ్మ గుడి వద్ద ఉన్న ప్రజా సంకల్పం పార్కు కు ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టారు. వైస్సార్సీపీ పార్టీ అధ్యక్షులు వై ఎస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర ముగింపు నకు గుర్తుగా ప్రజా సంకల్ప స్తూపం మరియు పార్కు నిర్మించారు.అనంతరం దాని నిర్వహణ గాలి కి వదిలేశారు.పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కూడా పట్టించుకోలేదు. ఎట్టకేలకు ఎమ్మెల్సీ నర్తు రామారావు మరమ్మతులు చేపట్టారు.

# ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం






**శ్రీకాకుళం, జులై 11(వార్త):** ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్రీకాకుళం నందు జిల్లా స్థాయిలో జరిగిన వ్యాసరచన మరియు పెయింటింగ్ పోటీలను 9 వ తేదీన నిర్వహించబడినవి. చిత్రలేఖనం పోటీలు " పొగాకు మత్తు పదార్ధాల వినియోగం, నివారణ మరియు వ్యాసరచన పోటీలు " లింగ సమానాత్వం, గౌరవ మర్యాదలు" అనే ఇతివృత్తం ఆధారంగా నిర్వహించబడినవి. ఈ వ్యాసరచన పోటీలలో భూమిక పండా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, హిరమండలం, తోట హారిక కె.జి.బి.వి. ఆమదాలవలవలస, మైలపల్లి రాజేశ్వరి, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, శ్రీకాకుళం ప్రధమ, ద్వితీయ, తృతీయ బహుమతులను పొందినారు.

చిత్రలేఖనం పోటీలలో రాయల విశాలి, మున్సిపల్ ఉన్నత పాఠశాల, అరసవిల్లి, ముద్దాడ గాయత్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్రీకాకుళం, బగాది నిహారిక ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాల, కుప్పిలి వారికి ప్రధమ, ద్వితీయ, తృతీయ బహుమతులను పొందినారు. బహుమతులను జిల్లా విద్యాశాఖాదికారి, శ్రీకాకుళం డాక్టర్ ఎస్. తిరుమల చైతన్య గారు అందజేసారు. ఈ సందర్బంగా జనాభా విద్య, లింగ సమానత్వం గురించి విద్యార్థులకు తెలియజేసారు. డైట్ వమరవల్లి వారి ఆద్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎ. గౌరి శంకరరావు, సీనియర్ అద్యాపకులు, పాండ్రంకి కృష్ణ, చలపాక రమణ, ఉపన్యాసకులు పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాద్యాయులు పాల్గోనారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) లో ఎకనామిక్స్, జువాలజీ విభాగాల యూత్ రెడ్ క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో, జేమ్స్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్ భాగస్వామ్యంగా ప్రపంచ జనాభా దినోత్సవం అవగాహన కార్యక్రమం శు క్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. సూర్యచంద్రరావు గారు అధ్యక్షత వహించి మాట్లాడుతూ, "ప్రపంచ జనాభా దినోత్సవం ద్వారా జనాభా పెరుగుదల, అభివృద్ధిపై ప్రభావం, ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన పెంచడం అవసరం" అన్నారు. జేమ్స్ హాస్పిటల్ నుండి పలువురు వైద్యులు పాల్గొన్నారు. డా. అరవింద్ మాట్లాడుతూ, "జనాభా నియంత్రణ వల్ల అనేక లాభాలు ఉన్నాయని, సమాజ ఆరోగ్యానికి, ఆర్థికాభివృద్ధికి సహాయపడుతుందని చెప్పారు. డా. రామారావు మాతృ ఆరోగ్యం, పిల్లల సంక్షేమం, కుటుంబ నియంత్రణ ప్రాధాన్యతను వివరించారు. కళాశాల ఆర్థికశాస్త్ర విభాగాధిపతి టి. ఆదిలక్ష్మి మాట్లాడుతూ, "ఈ ఏడాది థీమ్ ు 'యువతకు న్యాయమైన ఆశాజనకమైన ప్రపంచాన్ని సృష్టించడంలో మద్దతు ఇవ్వడం' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా. ఎన్. చిన్నారావు, అకడమిక్ కోఆర్డినేటర్ శ్రీమతి కె. మౌనిక, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ శ్రీమతి ఎస్. పద్మావతి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శ్రీమతి టి. ఆదిలక్ష్మి, డా. బి. ప్రభాకర్ (ఎకనామిక్స్), శ్రీమతి ఐ. హేమ పద్మజ (జువాలజీ), డా. వర్ష, డా. రేవతి, డా. వై. రవికుమార్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## బలహీన వర్గాల సంక్షేమమే పరమావధి



**మందస, జులై 11(వార్త):** బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే పరమావధిగా రాష్ట్రంలో కూటమి సర్కార్ పాలన సాగిస్తుందని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు భావన దుర్యోధన అన్నారు. సాబకోట, బుడంబో పరిధిలో సుపరి పాలనలో బంగారు కుటుంబాలకు పథకాలు యధావిధిగా అమలు జరుగుతాయని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం సబ్ ప్లాన్ నిధులు మళ్ళీ ఇస్తుందని, గిరిజన గ్రామాలు మరింత అభివృద్ధి చెందు తాయన్నారు. ఏడాది పాలనలో ఎన్నో సంస్కరణలు తీసుకొని వచ్చిందని అన్నారు. కక్ష, సాధింపులు కూటమి సర్కార్ లక్ష్యం కాదని, రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవ డమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఏడాది పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో ఆనందంగా ఉన్నారని భావన దుర్యోధన అన్నారు. కార్యక్రమంలో రట్టి లింగరాజు, తమిరి భాస్కరరావు, ముంజేటి చంద్రశేఖర్, మంగళ పాత్రో, అడ్డి ఈశ్వరరావు, దుప్పల జగన్నాదం, సవర జగన్, లొద్దక మోహన్, దోలాయి కృష్ణ, సవర కృష్ణ, సవర దివాకర్ పాల్గొన్నారు.

# కుటుంబ నియంత్రణపై అవగాహన ఉండాలి

**-డీఎంహెచ్ఓ డాక్టర్ కె.అనిత**

**శ్రీకాకుళం, జులై 11(వార్త):** ప్రజలు కుటుంబ నియంత్రణ పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా కె.అనిత అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు శుక్రవారం నిర్వహించడం జరిగిందన్నారు. ప్రతీ సంవత్సరం జులై 11వ తేదీన ప్రపంచ జనాభా దినోత్సవం జరుపుకుంకున్నటాలు ఆమె తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ సంవత్సరం ఇచ్చిన నినాదం "మహిళలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే గర్భధారణ గురించి ఆలోచించాలి" అని అన్నారు. చిన్న కుటుంబాలు వున్ననాడే దేశం పురోభివృద్ధి చెందుతుందని, దీనికి ప్రజలు పూర్తిగా సహకరించి చిన్న కుటుంబాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరుకుందామన్నారు. జనాభాపరంగా మన దేశం చైనాను అధిగమించిందని ఆమె అన్నారు.

2001-2011 గణాంకాల ప్రకారం 11.10గా తగ్గినదన్నారు. 2011 నుండి 2021కు జనన రేటు 6 శాతంకు తగ్గినదన్నారు. దీనికి గల కారణం కుటుంబ నియంత్రణ పట్ల కుటుంబ సంక్షేమ కార్యక్రమాల పట్ల ప్రజలలో పూర్తిగా అవగాహన కలిగినదని మనము భావించవచ్చునన్నారు. ప్రపంచ జనాభా దినత్సవం సందర్భంగా "మహిళలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే గర్భధారణ గురించి ఆలోచించాలి" అనే నినాదంతో ముందుకు వెళ్ళేందుకు కొన్ని ముఖ్యమైన అంశములతో మరింత శ్రద్ధ చూపి ప్రజారోగ్యం మరింత మెరుగు పరిచేందుకు ప్రభుత్వం విధివిధానాలు, ప్రణాళికలు రూపొందించడం జరిగినదన్నారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయం నుండి ఏడు రోడ్ల వరకు వివిధ




కళాశాల, ఆశా వర్కర్స్, వైద్య మరియు ఆరోగ్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో డెమో అధికారి డి ఐ ఓ డా.రామదాసు,ఎస్ ఓ రామ నాగేశ్వరావు, యం.వెంకటేశ్వర రావు, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఎస్. విజయలక్ష్మి, మంత్రి వెంకటస్వామి, ఆశా వర్కర్స్, కళాశాల విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546